# అంచనా

నెలలు నిండిన గర్భవతిలా నిండుగా ఉంది కృష్ణా ఎక్స్‌ప్రెస్. ప్రయాణీకుల తోపిళ్ళు రాపిళ్ళు ఒక ప్రక్క ఉండగా, "చాయ్ కాఫీల" నినాదాలు, "ఇడ్లీ , వడై, సాంబార్" అరుపులూ, వచ్చిపోయే ఇతర రైళ్ళ కూతలూ, కూలీల గడబిడా, పళ్ళు, బొమ్మలూ, పుస్తకాలూ వగైరా అమ్మే బళ్ళ వాళ్ళు ఎవరు ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పిచ్చాసుపత్రి సీనులా ఉంది సికింద్రాబాదు స్టేషను.

నా బోగి నెంబరూ, సీటు నెంబరు వెతుక్కుంటూ ఎలాగో లోపలికి ఎక్కాను. అక్కడ నా సీటులో ఒక లావుపాటావిడ హాయిగా కాళ్ళు జాపుకుని కూర్చుని బత్తాయిపండు ఒలుచుకు తింటుంది.

"క్షమించండి, ఇది నా సీటు" అన్నాను ఎంతో వినయంగా. నా వేపు చురచురా చూసింది కొరికేలా.

"ఇది నాసీటే" అంది ధీమాగా, బత్తాయితొన నోట్లో పెట్టుకుంటూ.

"కాదు. మీరు పొరపాటు పడుతున్నారు. కావాలంటే మీ టిక్కెట్టు చూసుకోండి" అన్నాను నెమ్మదిగా.

"ఇదిగో అమ్మాయ్! పొరపాటు గిరపాటు ఏంలేదు. మా ఆయన ఆఫీసరు. నాకు వారంటుంది. నువ్వే పొరపాటున ఫస్టుక్లాసు దబ్బాకెక్కినట్టున్నావ్. నీ వాలకం చూస్తే అలాగే ఉంది." గుక్కతిప్పుకోకుండా దండకం చదివేసింది. మెడ తిరగకుండా అడ్డుకుంటున్న (బహుశా గుచ్చుకుంటున్నాయేమో) చంద్రహారాలనీ, పలకసర్లనీ కానీ అంత బిళ్ళలతో రెండు వరసల్లో మెడకి బిగువుగా వున్న నల్లపూసల్ని సర్దుకుంటూ.

ఆవిడ మాటలకి షాక్ కొట్టింది నాకు. ఆఫీసరుగారి భార్యగా ఏం టెక్కు చూపెడుతుంది! యేం ఆఫీసరు బాబూ ఈమె ఖర్మ? ఆఫీసరు బాబులా మాట్లాడుతోంది ఈమె ఎందుకో ఆమెని చూస్తున్న కొద్దీ నవ్వొచ్చింది. అంతలోనే నా సీటులోంచి లేవకపోవడం చూసి ఒళ్ళు మండింది కూడా. కానీ, అవిడతో ఎలా మాట్లాడాలో తెలీక తికమక పడుతున్న నాకు "వారం దేమిటండీ! మీరు" అని ఎవ్వరో ప్రశ్నించడంతో, ఆవిడ అటు తిరిగి "హయ్యో నా మతి మండ, మా అబ్బాయి మిలట్రీ ఆఫీసరులెండి. వాడు వారంటుమీద వస్తాడు కదూ, అది విని విని నోటంట అదే వచ్చేసింది. మాది ప్యాసు" అంది నవ్వుతూ. ఇంతలో ఈ గొడవంతా చూసి, కండక్టర్ అటు కేసి వచ్చాడు. నా టిక్కెట్టునీ, ఆవిడగారి ప్యాసునీ చెక్ చేసి ఆవిడది పక్కసీటని తేల్చేశాడు. చేసేదిలేక "ఏధా ఖర్మమా" అంటూ ఆవిడ పక్కసీట్లోకి మారింది నావైపు కొరకొరా చూస్తూ.

"హమ్మయ్య" అనుకుని నా సీట్లో కూర్చున్నాను. వెంటనే రైలు కూత కూసింది. గార్డు పచ్చజండా ఊపాడు "బై బై" అన్నాడు ప్రసాద్. "బై" అంటూ నా చిన్న సూట్ కేసుని పక్కగా పెట్టుకున్నాను. మరచెంబు, ఫ్లాస్కు, పళ్ళు ఉన్న బుట్టని కాళ్ళ దగ్గరగా పెట్టుకుని, కుడిచేతివైపో సూటుకేసూ, పైన అటకమీద రెండు పెట్టెలూ సర్ది, కాళ్ళు చాపుకుని కూర్చుందావిడ. రైలు వేగం హెచ్చింది. నేను బ్రీఫ్‌కేసులోంచి వీక్లీ తీసి చదువుకుంటున్నాను. ఎవరికి వారు పేపరో, పుస్తకమో తీసుకుని కూర్చున్నారు. ఉన్నట్టుండి "ఇందాక స్టేషన్‌కొచ్చి నాయన నీకేమవుతారు" అంది ఆవిడ. ఆ ప్రశ్న నన్నే అడుగు తుంది. ఆవిడ చూపులన్నీ నా బోస్తి మెడమీదే ఉన్నాయ్. "మా అన్నయ్య" అన్నాను ముక్తసరిగా మళ్ళీ పుస్తకంలోకి మెడదూర్చి.

"ఏమిటో, ఈ రోజుల్లో ఎవరు ఎవరో తెలీడంలేదు" అంది పెదవి విరుస్తూ.

ఆవిడ మాటలకి నాకు ఒళ్ళు మండిపోయింది. ఈడ్చి పుచ్చుకు తన్నాలనిపించింది కానీ, యేమీ చెయ్యలేక, నోరు మూసుకు కూర్చున్నాను. రెండు లైన్లు చదివానో లేదో మళ్ళీ ప్రశ్న "నీకింకా పెళ్ళి కాలేదా?" అని.

"లేదు" ఈసారి ముక్తసరిగా, తలెత్తి ఆమెకేసి చూడకుండానే సమాధానం ఇచ్చాను.

"ఎలా అవుతాయిలే, ఆడపిల్ల పెళ్ళంటే మాటలా? బోలెడంత కట్నం కుమ్మరిస్తే కానీ, ఆడపిల్ల ఇల్లు కదలదు. సామాన్య జీతగాడికి శిక్ష ఇద్దరు ఆడపిల్లలు పుడితే చాలు, నడుం వంగి పోవలసిందే, జుట్టు నెరిసి పోవలసిందే!" మళ్ళీ దండకం మొదలెట్టింది ఎవరు విన్నా వినకపోయినా. ఆవిడ ధోరణి మహా చిరాకు పుట్టించింది నాకు. అక్కణ్ణించి లేచిపోవాలనిపించింది. కాని ఎక్కడ కూర్చోవాలి? అన్ని సీట్లూ నిండిపోయాయి. చచ్చినట్టు, తలవంచుకుని పుస్తకం అడ్డు పెట్టుకున్నాను ఆమెను చూడ్డం ఇష్టంలేక.

ఇంతలో "పల్లీ....పల్లీ....పల్లీ........బఠానీ" అంటూ ఒక కుర్రాడు లోపలికొచ్చాడు.

"ఏయ్ పల్లీ ఇలా రా...." పిలిచింది ఆమె "ఎలా ఇస్తున్నావ్?"

"యాభై పైసలు గొట్టం" చిన్న గొట్టాన్ని చూపించాడు వాడు.

"ఇది యాభై పైసలా? ఇరవై ఐదు పైసలకివ్వు" అంది.

"పడదు" అంటూ తిరిగి వెళ్ళబోయాడు వాడు

"సరే ఇవ్వు. ఏంచేస్తాం? అందుకే మామూలు జీతగాళ్ళు బతకలేక చస్తున్నారు. ఎవరో ఆఫీసర్లు తప్ప, వేలంత లేదు గొట్టం పల్లీలే యాభై పైసలయితే, తులం బంగారం ఖరీదు వేరే చెప్పాలా? అందుకే ఈ రోజుల్లో అందరూ ఫాషనంటూ ప్లాస్టిక్ దుద్దులూ, ప్లాస్టిక్ గాజులూ తగిలించుకుంటున్నారు. బోసి మెడ మరీ ఫాషనూ." ఇంత లెక్చరూ ఇచ్చి వాడి చేతిలో యాభై పైసలూ పెట్టింది. అందరూ ఈవిడ కేసి చూసి నవ్వుకున్నారు.

అందరూ ఆవిడ మాటలు వింటున్నారని మురిసిపోతున్నట్టుంది ఆమె! గర్వం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనపడింది. అసహ్యంవేసి నేను తల కిటికీ వైపు తిప్పుకున్నాను. కానీ ఏం లాభం?

"అమ్మాయ్, ఇవిగో తీసుకో" అంటూ కొన్ని బఠాణీలు చేతిలో పుచ్చుకుని పిలవడం మొదలెట్టింది.

నన్ను కాదన్నట్టు నేను తిరిగి చూడలేదు.

"ఏయ్, నిన్నే, నీ పేరేమిటి?" ఈసారి మరీ బిగ్గరగా అంది.

ఇంక లాభం లేదనుకుని చెప్పాను 'లావణ్య' అని.

"ఏమిటో, 'లావణ్య', "నాజూకూ", "సుకుమారి" నా బొంద పేర్లు. లక్షణంగా "లక్ష్మి", "సరస్వతి", 'పార్వతి' ఇలాంటి దేవుళ్ళ పేర్లు మాను

కుని ఫాషను పాషనంటూ చచ్చు పేర్లు పెట్టుకుంటున్నారు. దేవుళ్ళ పేర్లు పెట్టుకోడం నామోషి అయిపోయింది. మళ్ళీ ఆ లక్ష్మీదేవి కటాక్షం లేనిదే బతుకు వెళ్ళదు. సరస్వతి ప్రసన్నం కానిదే ఉండలేరు. నోరారా పిలుచుకోవడానికి, తలుచుకోవడానికి కూడా లేకుండా కొత్త కొత్తగా ఈ వెధవ పేర్లు!" మళ్ళీ వల్లించింది దండకం.

ఈసారి నాకు నిజంగానే ఏడుపొచ్చేసింది, నా పేరుమీద ఈవిడ చేసిన వ్యాఖ్యానం వింటూ ఉంటే! అసలు పొద్దున్నే ఈవిడ ప్రక్కన కూర్చున్నందుకు నామీద నాకే జాలేసింది. కండక్టరుకి చెప్పి, నా సీటు మార్పించుకోవాలన్నంత కోపం వచ్చింది. కానీ ఏమీ చెయ్యలేక సభ్యత ముసుగులో నోరు మూసుకుని కూర్చున్నాను. మరో కొన్ని గంటలు ఎలా గడుస్తాయా భగవంతుడా అనుకుంటూ.

"మీ రెంతమంది అక్క చెల్లెళ్ళు, అన్న దమ్ములు?" మరో ప్రశ్న.

"ఇద్దరు చెల్లెళ్ళూ ఒక అన్నయ్యా." విసుగ్గా చెప్పాను. కోర్టులో లాయరు లాగా ఆమె ప్రశ్నలడగడం, బోనులోని ముద్దాయిలా నేను సమాధానం చెప్పడం, కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది నాకు.

"హూ....ఆడ సంతానమే ఎక్కువన్న మాట! పాపం, మావారి ఆఫీసులో ఒక గుమాస్తా ఉన్నాడు. అతనికి ఐదుగురు ఆడపిల్లలు. ఎవరో చెయ్యి చూసి ఆరో సంతానం మగపిల్లాడు పుడతాడని చెప్పారట. అందుకని మళ్ళీ ప్రయత్నం చేశారు. మళ్ళీ ఆడపిల్లే పుట్టింది. ఆరుగురు ఆడపిల్లలకి తండ్రయి కూర్చున్నాడు. ఇప్పుడు లబోదిబోమని మొత్తుకుంటాడు ఏం లాభం? ఆరుగురికి పెళ్ళిళ్ళు చేసి పంపాలంటే మాటలా?" పకపకా నవ్వింది. అదేదో పెద్ద జోక్‌లాగా. ఆ గుమాస్తా గురించి అంత హేళనగా, అతని బలహీనతను గురించి అంత తేలిగ్గా ఆమె మాట్లాడుతుంటే నాకు ఒళ్ళు మండింది. ఈసారి పుస్తకాన్ని పూర్తిగా మొహానికి అడ్డంగా పెట్టుకున్నాను, చదువుతున్నట్టు నటిస్తూ.

"మావారికి ఆడపిల్లలంటే ఎంతో ముద్దు. మా సుధీర్ కడుపులో ఉన్నప్పుడు, ఆడపిల్ల పుడుతుందేమోనని గొలుసు, గాజులూ, ఉంగరాలూ ముందే చేయించి పెట్టారు తీరాచూస్తే మగపిల్లాడు పుట్టాడు. అవన్నీ ఆ నన్నానికే వేశాం. ముచ్చటపడుతూ."

నేను ఆవిడకేసి చూడకపోయినా, ఆమె నాకు వినపడేలా మాట్లాడడం నాకు మరీ బాధనిపించింది. అయినా పుస్తకాన్ని మాత్రం అడ్డు తియ్యకుండా, అలాగే కూర్చున్నాను. టైమ్ పన్నెండయింది. విజయవాడ చేరడానికి మరో

అరగంట పడుతుంది. ఈలోగా ఈవిడ ఎన్ని ప్రశ్నలు వేస్తుందో తలుచుకుంటే గుండె దడదడలాడింది.

ఒక అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి ఆ నిశ్శబ్దానికి కారణం తెలీక, మెల్లిగా పుస్తకాన్ని కిందికి దించిచూశాను. ఆమె బాత్‌రూమ్ లోంచి బయటికొస్తూ, నాకేసి చూసి నవ్వింది హడలిపోయాను. ఎందుకు చూశానా అని బాధపడుతూ.

"నీ కోసం స్టేషనుకి ఎవరైనా వస్తారా, నువ్వే పోతావా?"

"వస్తారులెండి." తలవంచుకునే సమాధానం ఇచ్చాను.

"లేకపోతే చెప్పు. మా బంట్రోతు ఎలాగో వస్తాడు స్టేషనుకి. నీకూ ఒక టాక్సీయో, ఆటోనో తెచ్చిపెడతాడు. మావాడికి టైముండదు రావడానికి. పైగా ఈ గుమాస్తాలు ఆఫీసుల్లో సరిగ్గా పనిచెయ్యరట. బాధ్యతంతా ఆఫీసరుదే నట. ఆఫీసరుగిరి సామాన్యం కాదే అంటుంటారాయన." ఆవిడగారి మాటలన్నీ విన్నాక, ఆవిడగారి భర్తగారు ఏ ఆఫీసరో తెలుసుకోవాలన్న కుతూహలం నాలో మొదటిసారిగా కలిగింది.

"మీ ఆయన యేం ఆఫీసరు?" నాకు నేనుగా ఆవిడతో మాట్లాడిన మొదటి మాట అది.

"రైల్వేలో ఆదేదో ఆఫీసరు! అవును, మరిచేపోయా అడగటం, మీ నాన్నగారికేం పని?" వక్కపొడి నోట్లో వేసుకుంటూ అడిగింది.

"నాన్నగారు హైకోర్టులో జడ్జి, అన్నయ్య నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ఇంజనీరు, ఒక చెల్లి స్మిత డాక్టరు! రెండోది మయూరి ఎల్.ఎల్.బి. పూర్తి చేసింది. నేను ఐ.ఎ.ఎస్. పాసయ్యాను. విజయవాడలో కలెక్టరుగా ఉంటున్నాను" అన్నాను గుక్కతిప్పుకోకుండా, మళ్ళీ ఆవిడ మరో ప్రశ్న వెయ్యకుండా.

"యేమిటి? మీ నాన్న జడ్జిగారా? అన్నయ్య ఇంజనీరా? ఒక చెల్లి వకీలు. మరో చెల్లి డాక్టరూ, నువ్వు - నువ్వు కలెక్టరువా?" ఆశ్చర్యంతో నోరు తెరిచింది. అంతే. షాక్ కొట్టిందేమో, తెరిచిన నోరు ఎంత సేపటికి మూత పడ లేదు. విజయవాడ రానేవచ్చింది నా స్టాఫంతా నాకోసం రావడంతో నేను గబగబా ట్రెయిన్ దిగిపోయాను. కానీ పాపం, ఆ ఆఫీసరుగారి భార్య మాత్రం ఇంకా షాక్‌నుండి తేరుకున్నట్టు లేదు. నాకేసి నోరు తెరుచుకుని చూస్తూ అలాగే కూర్చుండిపోయింది మతిపోయినదానిలా.

"బంగారంతోనో బట్టలతోనో ఎదుటివారిని అంచనా వేసే ఆడబుద్ధి పోయేదెప్పుడో!" నాలో నేనే గొణుక్కుంటూ వెళ్ళి కార్లో కూర్చున్నాను. *